పార్కింగ్ పరేషాన్ !

- 'పురం'లోని ప్రధాన రహదారుల్లో బండి నిలపాలంటే పార్కింగ్ స్థలం కరువు
- రోడ్లపైనే తోపుడు బండ్లు, ఆటోలు, వాహనాలు నిలుపుతున్న వైనం
- ఇబ్బందులు పడుతున్న జనం

హిందూపురం: పట్టణంలో రోజురోజుకు పెరుగుతున్న వాహనాల రద్దీతో ట్రాఫిక్ సమస్య అస్తవ్యస్తంగా మారింది. ఎటూ చూసినా వాహనాల రద్దీనే కనిపిస్తోంది. ఉదయం పూట స్కూళ్లు, కళాశాల సమయాల్లో సమస్య మరింత అధికమవుతోంది. పనిమీద బయటకు వచ్చిన వాహనదారులు తమ వాహనాన్ని ఎక్కడ పార్క్ చేయాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. పురం ప్రధాన రహదారికి ఇరుపక్కలా ఎటుచూసినా దుకాణాల ఎదుట వరుసగా ద్విచక్ర వాహనాలు బారులు తీరి కనిపిస్తుంటాయి.

జటిలంగా పార్కింగ్ సమస్య

జిల్లా కేంద్రం స్థాయిలో ఉన్న హిందూపురం పట్టణం వ్యాపార, వాణిజ్య రంగాలకు కేంద్రంగా ఉంది. రోజూ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వ్యాపారులు, ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డుపై పాదచారులు వెళ్లడానికి కూడా వీలులేని రీతిలో వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. అయితే ప్రధాన రహదారుల్లో ఎక్కడా పార్కింగ్ వ్యవస్థ మాత్రం లేదు. ఆర్టీసీ బస్టాండు నుంచి మొదలు ఎస్‌బీఐ సర్కిల్, రైల్వేరోడ్డు గుండా రైల్వేస్టేషన్ వరకూ, ఇటు పాతమార్కెట్ నుంచి గాంధీసర్కిల్ వరకూ ఎంఎఫ్ రోడ్డు, పరిగిరోడ్డు, ఆర్పీజీటీ రోడ్డు ఇలా ప్రధాన రహదారి పొడవునా ఎటూ చూసినా ఎక్కడా వాహనాలకు పార్కింగ్ సౌకర్యం లేదు. ప్రధానంగా ఆర్‌పీజీటీ రోడ్డు, సబ్‌రిజిస్ట్రార్ ఆఫీస్, ఎన్‌జీఓ క్యాంటిన్ కాంప్లెక్స్, పెనుకొండ రోడ్డు, అంబేడ్కర్‌సర్కిల్, పాత మార్కెట్ ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్ పెద్ద సమస్యగా మారింది. సాధారణ ప్రజలు రోడ్డుపై నడవలంటే ఎటూ నుంచి ఏ వాహనం వస్తుందోనని ఆందోళన చెందాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. రోడ్డుపైనే వాహనాల నిలిపివేయాల్సి వస్తుంటంతో రాకపోకలు తీవ్ర ఇబ్బందిగా మారింది. దీంతో పాటు ప్రధాన రోడ్డు లోనే తొపుడుబండ్లు, ఆటోలను ఇష్టారాజ్యంగా నిలిపివేస్తుండటంతో సమస్య జటిలంగా మారుతోంది.



ఆర్‌పీజీటీ రోడ్డులో పార్కింగ్ వసతి లేక రోడ్డుపైనే వాహనాలను నిలిపిన దృశ్యం

నిబంధనలకు పాతర

పట్టణంలోని ప్రధాన రహదారిలోని దుకాణదారులు, హోటళ్ల ఇతర దుకాణదారులు షాపు ఎదుట మార్జిన్ స్థలాన్ని వదలివేయకుండా కాల్వలు దాటి రోడ్డు ముందు వరకూ మెట్లు, అరుగులు వేసుకోవడంతో వాహన పార్కింగ్‌కు స్థలం లేకుండా పోయింది. దీనివల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. వీరందరూ నిబంధనల ప్రకారం పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయకపోవడమే సమస్యకు ప్రధాన కారణమైంది. ప్రజలు తమ వాహనాలను ఆయా దుకాణాల ఎదుటే వాహనాలను నిలిపాల్సి వస్తోంది. పార్కింగ్ చేసే సమయంలో గొడవలు కూడా జరుగుతున్నాయి. దీనికి తోడు దుకాణాల ఎదుట పార్కింగ్ చేసినప్పుడు ట్రాఫిక్ పోలీసుల నుంచి ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. రోడ్డుకు అడ్డుగా ఉన్నాయని వాహనాలకు గాలితీసేయడం, ప్లగ్గులు తీసేయడం, ఫైన్లు వేస్తుండటంతో వాహనదారులకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. దీనికితోడు ఆటో పార్కింగ్‌కు కూడా సరైన ప్రదేశాలు లేకపోవడంతో వారు రోడ్డు పక్కనే నిలిపేస్తున్నారు. సాయంత్రం పూట వివిధ రకాల చిరువ్యాపారుల తొపుడు బండ్లు కూడా రోడ్లపైనే ఉంచి వ్యాపారాలు చేసుకోవాల్సిన పరిస్థితి. సరైన రహదారి నిర్మాణం జరగకపోవడంతోనే ఈ సమస్య నెలకొందని ప్రజలు చెబుతున్నారు. ఆక్రమణలు కూడా ఇబ్బందులకు కారణమంటున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు దీనిపై దృష్టి సారించి ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

హిందూపురం పట్టణ జనాభా	సుమారు 2.80 లక్షలు
పట్టణంలో ద్విచక్ర వాహనాల సంఖ్య	1.12 లక్షలు
కార్ల సంఖ్య	సుమారు 2,300

పార్కింగ్ సమస్య అధికంగా ఉంది



పట్టణంలో వాహనాల పార్కింగ్ సమస్య అధికంగా ఉంది. ద్విచక్ర వాహనాలు రోడ్డు పక్కనే ఎక్కడ పడితే అక్కడ నిలిపేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీనివల్ల ట్రాఫిక్ సమస్యతో పాటు రహదారిలో ఉన్న దుకాణదారులకు కూడా ఇబ్బందులు తప్పడం లేదు. ఆఖరికి పాదచారులకు కూడా ఇబ్బందులు కలుగుతున్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. పెరిగిన వాహనరాకపోకలకు అనుగుణంగా అధికారులు, ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టాలి. – ఇర్ఫాన్, హిందూపురం

ట్రాఫిక్ క్రమద్ధీకరణకు చర్యలు



పట్టణంలోని ప్రధాన కూడళ్లలో పార్కింగ్ వ్యవస్థను మెరుగుపర్చాల్సి ఉంది. ఉన్న వసతులతో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకుంటాం. ప్రజలు కూడా ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలిపివేయకుండా పోలీసులకు సహకరించాలి. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. లేకపోతే ప్రమాదాలు జరిగే అవకాశాలు లేకపోలేదు. ప్రధాన కేంద్రాల్లో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకుంటాం. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవు. – మహేష్, డీఎస్పీ, హిందూపురం

క్లుప్తంగా

వైద్య సేవలకు సిద్ధంగా ఉండాలి



వైద్యులతో మాట్లాడుతున్న ఆర్డీఓ ఆనంద్‌కుమార్

హిందూపురం టౌన్: తుపాను హెచ్చరికల నేపథ్యంలో అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రికి వచ్చే వారికి వైద్య సేవలు అందించడానికి సిద్ధంగా ఉండాలని పెనుకొండ ఆర్డీఓ ఆనంద్ కుమార్ వైద్యులకు సూచించారు. మంగళవారం సాయంత్రం జిల్లా ప్రభుత్వాస్పత్రిని ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ లింగన్నతో కలిసి ఆర్డీఓ పరిశీలించారు. భారీ వర్షాల నేపథ్యంలో ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న సేవలు, బెడ్స్, మందులు తదితర వాటిని పరిశీలించారు. అలాగే మాతాశిశు కేంద్రంలో అడ్మిషన్‌లో ఉన్న గర్భిణులు, బాలింతలు, పిల్లల వివరాలను తెలుసుకున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వచ్చిన రోగులకు వైద్య సేవలు అందేలా చూడాలని ఆదేశించారు.

ప్రశ్నాపత్రాన్ని మార్చండి

పావగడ: పదో తరగతి సైన్స్ ప్రశ్నా పత్రాన్ని మార్చాలని తాలూకా ప్రభుత్వ ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుల సంఘం డిమాండ్ చేసింది. స్థానిక బీఈఓ కార్యాలయంలో మంగళవారం చేపట్టిన ఆందోళనలో వారు మాట్లాడుతూ ప్రాథమిక, ఉన్నత పాఠశాల స్థాయిలో చదివే విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తి పెంపొందించడం ఎంతో అవసరమన్నారు. ఈ క్రమంలో సైన్స్ పాఠ్యాంశానికి సంబంధించిన ప్రశ్నా పత్రం స్వరూపాన్ని మార్చడం కూడా అంతే అవసరమన్నారు. అనంతరం బీఈఓ ఇంద్రాణమ్మకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వేదిక అధ్యక్షుడు రవీంద్ర, కార్యదర్శి మహేశ్వరప్ప, ట్రెజరర్ రేణుకారాజ్ తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



కింద పడిన వైరు తగిలి మృతి చెందిన కుక్క

మడకశిరరూరల్: మండల పరిధిలోని గొల్లపల్లి, బీసీ కాలనీ మధ్యలో 11 కేవీ విద్యుత్ వైరు మంగళవారం తెగి పడింది. వర్షం పడుతుండడంతో అటు వైపు ప్రజలు వెళ్లకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అయితే అటు వైపు వెళ్లిన కుక్కకు కింద పడిన వైరు తగిలి అక్కడిక్కడే మృతి చెందింది. స్థానికులు వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం అందించడంతో విద్యుత్ సరఫరాను నిలిపి వేశారు. అనంతరం మరమ్మతు పనులు చేపట్టారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

హిందూపురం టౌన్: రాబోవు రెండు రోజుల్లో భారీ వర్షాలకు అవకాశముందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ వెంకటేష్ తెలిపారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే సెల్ నంబర్: 8125043157కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చన్నారు.

రైల్వేరోడ్డులో భవనాల తొలగింపు షురూ..



ఎస్‌బీఐ సర్కిల్‌లో షాపులు తొలగించిన దృశ్యం

హిందూపురం: పట్టణంలోని ప్రధాన రహదారి అయిన రైల్వేరోడ్డు పునరుద్ధరణ పనులకు మున్సిపల్ అధికారులు మంగళవారం శ్రీకారం చుట్టారు. ప్రధాన రహదారి రైల్వేరోడ్డు పునరుద్ధరణకు గత ప్రభుత్వం నిధులు, రూట్ మ్యాప్ సిద్ధం చేసింది. ఎన్నికల కారణంగా పనులు నిలిచిపోయింది. ప్రస్తుతం పనులు ప్రారంభమయ్యాయి. ఎన్‌టీఆర్ సర్కిల్ నుంచి రైల్వేరోడ్డు నందిసర్కిల్ వరకు 70 అడుగుల రోడ్డు ప్రతిపాదనలతో రోడ్డుపక్కనున్న ఆక్రమణ, నిర్మాణాలు తొలగింపు చేస్తున్నారు. నెలఖారులోపు ఆక్రమణాలన్నీ తొలగించి పనులకు ఆటంకం లేకుండా చేస్తామని మున్సిపల్ డీఈ సునీల్ తెలిపారు.

వైభవంగా వీరభద్రుడి రథోత్సవం



పురవీధుల్లో కొనసాగుతున్న రథోత్సవం

అగళి: మండలంలోని మధూడిలో వెలసిన వీరభద్రస్వామి రథోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే స్వామివారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తిని రథంపై కొలువు దీర్చి భక్తుల గోవింద నామస్మరణ మధ్య రథోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ పాలక మండలి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

రాష్ట్రంలో మహిళలకు రక్షణ ఎక్కడ ?

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప



మడకశిర: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళలకు రక్షణ కరువైందని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రధానంగా మహిళలపై అత్యాచారాలు రోజురోజుకూ పెరిగిపోయాయన్నారు. అయినా ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేదన్నారు. జిల్లాలో ఇద్దరు మహిళలపై ఇటీవల జరిగిన గ్యాంగ్ రేప్ ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ప్రభుత్వ వైఫల్యంతోనే మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మహిళలపై జరుగుతున్న అత్యాచారాలపై నోరు విప్పడం లేదన్నారు. హోంమంత్రి అనిత ఆ పదవిలో ఉండే అర్హత కోల్పోయారని స్పష్టం చేశారు. అత్యాచార బాధితులకు రూ. 10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ప్రశ్నలను రేకెత్తించే కథలు

- కొన్ని చీకట్లూ.. ఓ వెలుతురు కథా సంపుటి ఆవిష్కరణ



కథా సంపుటి ఆవిష్కరిస్తున్న అతిథులు

హిందూపురం టౌన్: పట్టణంలోని ఎస్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, పుస్తక రచయిత డాక్టర్ ప్రగతి రచించిన కథా సంపుటి "కొన్ని చీకట్లూ.. ఓ వెలుతురు" పుస్తకావిష్కరణ కళాశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత వేంపల్లి షరీఫ్, సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్, రచయిత సడ్లపల్లి చిదంబర్‌రెడ్డి పాల్గొన్నారు. పుస్తకావిష్కరణ అనంతరం వక్తలు మాట్లాడుతూ కౌమార దశ దాటి అప్పుడే యవ్వనంలోకి అడుగిడుతున్న యువతులు లక్ష్యం వైపు పయనిస్తున్న క్రమంలో ఎదురయ్యే అనేక సవాళ్లను రచయిత వివరించిన తీరు అమోఘమన్నారు. కుల గౌరవాలు, కట్టుబాట్ల పేరుతో జరిగే బలవంతపు పెళ్లిళ్లు, బాల్య వివాహాలు, వివిధ రకాల ప్రలోభాలతో జరిగే మోసాలు తదితర సమస్యలన్నింటినీ సవాళ్లుగా ఎదిరించి జీవిత ప్రగతి పథంలో ఏ విధంగా ముందుకెళ్లాలో తెలియజేసిన విధానం స్ఫూర్తిదాయకమని చెప్పారు. కార్యక్రమంలో సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ హరి, అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు సిద్ధగిరి శ్రీనివాస్, పుస్తక ప్రచురణకర్త అరుణాంక్, రచయితలు కల్లూరి రాఘవేంద్ర రావు, శొంటి జయ ప్రకాష్, చైతన్య గంగిరెడ్డి, చింతా గంగిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి ఏరులై పారనున్న మద్యం

- నియోజకవర్గంలో ఏర్పాటు కానున్న 10 మద్యం షాపులు



మడకశిర: నూతన మద్యం పాలసీ బుధవారం నుంచి అమలుల్లోకి రానుంది. దీంతో నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోనూ మద్యం ఏరులై పారనుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కేవలం నియోజకవర్గంలో 6 మద్యం షాపులు మాత్రమే ఉండేవి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నియోజకవర్గంలో 10 మద్యం షాపులను ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా ఆ షాపులను ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించింది. మడకశిర మున్సిపాలిటీ 2, మడకశిర రూరల్ మండలంలో 2, గుడిబండ మండలంలో 2, అమరాపురం మండలంలో 2, రొళ్ల, అగళి మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున ప్రారంభిస్తున్నారు. ఇదిలా ఉండగా మద్యం షాపుల యజమానులు గ్రామాల్లో మద్యాన్ని ఏరులై పారించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ప్రతి గ్రామంలోనూ బెల్ట్ షాపులను తెరవడానికి తమ అనుచరులను సిద్ధం చేశారు. ఒక్కో గ్రామంలో 4 నుంచి 5 బెల్ట్ షాపులు ఏర్పాటు కానున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని మెజార్టీ ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

అనుమానితులపై సమాచారమివ్వండి

సోమందేపల్లి: గ్రామంలో అనుమానాస్పద వ్యక్తులు కనబడితే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ రమేష్‌బాబు సూచించారు. మంగళవారం రాత్రి పాతఊరులో ఆయన స్థానికులతో సమావేశం నిర్వహించారు. చోరీలకు చెక్ పెట్టేందుకు షాపులు, ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రాత్రివేళల్లో గస్తీ ముమ్మరం చేస్తామని పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్‌గా బోయ నరసింహులు



పెనుకొండ రూరల్: పెనుకొండ పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్‌గా బోయ నరసింహులు మరోసారి ఎంపికయ్యారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీ చరణ్ ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. పార్టీ బలోపేతానికి అందరి సమన్వయంగా కృషి చేయాలని సూచించారు.

పరిగి చెరువుకు వరద నీరు

పరిగి: కొద్దిరోజులుగా మండలంతో పాటు కర్ణాటక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో ప్రధాన కాలువలు, వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. ఇందులో భాగంగానే జయమంగళి నదికి వరద నీరు వచ్చి చేరుతోంది. మండలంలోని శ్రీరంగరాజుపల్లి వద్ద జయమంగళినదికి ఆనకట్టగా నిర్మించిన పాయకట్ట వద్ద నుంచి పరిగి చెరువుకు ఏర్పాటు చేసిన కాలువ ద్వారా నీటి ప్రవాహం పెరిగినట్లు స్థానికులు తెలిపారు.



శ్రీరంగరాజుపల్లి వద్ద పారుతున్న జయమంగళి నది

ఖైదీల కదలికలపై నిఘా ఉంచాలి



జైలు సిబ్బందికి సూచనలిస్తున్న శివప్రసాద్‌యాదవ్

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్‌యాదవ్

హిందూపురం టౌన్: వివిధ నేరాలు చేసి జైళ్లకు వచ్చే ఖైదీలపై నిరంతరం నిఘా ఉంచాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ సూచించారు. మంగళవారం స్థానిక ఉపకారాగారాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రస్తుతం ఉప కారాగారంలో ఉన్న ఖైదీలు, ఏఏ నేరాలు చేసి జైలుకు వచ్చారు? తదితర వివరాలను జైలు అధికారి అంజినాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన నేరుగా ఖైదీలతో వివిధ అంశాలపై మాట్లాడారు. అనంతరం జైలు గదులు, వంటగది, శుద్ధ నీటి ప్లాంట్ తదితర వాటిని పరిశీలించారు. ఉపకారాగారంలో సీసీ కెమెరాలు త్వరితగతిన ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయనతో పాటు ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాసరెడ్డి, న్యాయవాది నవేరా, లోక్ అదాలత్ సిబ్బంది శారద, హేమావతి తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: పెనుకొండ సబ్‌జైల్‌ను జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.శివప్రసాద్‌యాదవ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సబ్‌జైలులోని బ్యారెక్‌లు, మరుగుదొడ్లు, వంటగది, స్టోర్‌రూం, రికార్డులు పరిశీలించారు. అనంతరం ఖైదీలతో సమావేశమై మాట్లాడారు. ఖైదీలు జైలు నుంచి బయటకు వెళ్లిన అనంతరం సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ అజ్జు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

యత్తప్పస్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో యత్తప్పస్వామి

రొళ్ల: మండల పరిధిలోని గంతికల్లుగొల్లహట్టిలో వెలసిన యాదవుల ఆరాధ్య దైవం యత్తప్పస్వామి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారిని ఆభరణాలతో ముస్తాబు చేశారు. బుధవారం సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామ పొలిమేరలో దేవుడి పేరు మీద వదిలిన ఆవుల కల్లం వద్దకు ఊరేగింపుగా తీసుకువెళ్లి పట్టం కూర్చోబెట్టడం జరుగుతుందని అర్చకులు తెలిపారు.

రత్నగిరిలో..

రొళ్ల: రత్నగిరి కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక రోజు కావడంతో ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు కర్ణాటక రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.


ముందు జాగ్రత్త !

మడకశిరరూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయన్న అధికారుల సూచనతో కొందరు రైతులు అప్రమత్తం అయ్యారు. ఇందులో భాగంగానే తొలగించిన వేరుశనగ పంట ఇంటి వద్దకు వేసుకున్న రైతులు తడచిపోకుండా టార్పాలిన్, ప్లాస్టిక్ పేపర్లను కప్పుకున్నారు. ఇదిలా ఉండగా .. తొలగించిన వేరుశనగ పంట పొలంలోనే తడిసి పోతుండటంతో పశుగ్రాసం కూడా దొరకదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వర్షానికి తడిసిపోకుండా వేరుశనగకు టార్పాలిన్ కప్పిన దృశ్యం

అబ్దుల్ కలాంకు ఘన నివాళి



పెనుకొండ: అబ్దుల్ కలాం జయంతి వేడుకల్లో పాల్గొన్న మంత్రి సవిత

పెనుకొండ: దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం సేవలు మరువలేనివని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు. కలాం జయంతిని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మంత్రి మాట్లాడుతూ అబ్దుల్ కలాం శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎంతో పేరు ప్రఖ్యాతలు గాంచి సాధారణమైన జీవితాన్ని గడిపారన్నారు. పేపర్ బాయ్ నుంచి రాష్ట్రపతి స్థాయికి చేరుకోవడానికి ఆయన పట్టుదల, మనోదీక్ష, క్రమశిక్షణే కారణమన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు అధికారులు పాల్గొన్నారు.

విద్యాలయాల్లో...

పెనుకొండ పట్టణంలోని పలు విద్యాలయాల్లో మంగళవారం దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక ప్రభుత్వ, ప్రభుత్వేతర పాఠశాలలు, పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను వక్తలు కొనియాడారు.

రొద్దంలో 'స్వచ్ఛ భారత్'

రొద్దం: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో మంగళవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యాలయం వద్ద పేరుకు పోయిన పిచ్చి మొక్కలను తొలగించారు. ఈఓఆర్డీ గోవిందప్ప, పంచాయతీ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

అమరాపురం: మండలంలోని ఆలదపల్లి, కె.శివరం గ్రామ పంచాయతీల్లో మంగళవారం సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీడీఓ రామరావు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కెంచరాయ, ఏపీఓ జగదీష్, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధి పనులకు శ్రీకారం



సాంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్: మండలంలోని చంద్రగిరి గ్రామంలో పాఠశాల అభివృద్ధి పనులకు కియా అనుబంధ సంస్థ హుండై స్టీల్ ప్రతినిధులు శ్రీకారం చుట్టారు. ముందుగా మంగళవారం విద్యార్థులకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాలకు నూతన భవనం, మరుగుదొడ్లు నిర్మిస్తారని, ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు అందిన వెంటనే పనులు చేపట్టనున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

మధూడిలో 'పొలం పిలుస్తోంది'

అగళి: మండలలోని మధూడి గ్రామంలో ఏఓ శేఖర్‌నాయక్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ శేఖర్‌నాయక్ రైతులకు పలు సూచనలు, సలహాలిచ్చారు.

గ్రామ పంచాయతీ సభ్యుడి మృతి



గోవిందప్ప (ఫైల్)

పావగడ: తాలూకాలోని కన్నమేడి గ్రామ పంచాయతీ సభ్యుడు టి గోవిందప్ప (56) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ పీడీఓ రాఘవేంద్ర, అధ్యక్షురాలు వెంకటలక్ష్మమ్మ తదితరులు సంతాపం తెలిపారు.

రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

పరిగి: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర చేనేత జౌళీశాఖ మంత్రి సవిత తెలిపారు. మంగళవారం ఆమె పరిగి మండలంలో పర్యటించారు. బీచిగానిపల్లి పంచాయతీ పరిధిలోని గొల్లపల్లి, బీచిగానిపల్లి, పాత్రగానిపల్లి, వంగలపల్లి గ్రామాలలో దాదాపు రూ.57 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. భూమి పూజ అనంతరం పనులను ప్రారంభించారు. తర్వాత ఊటుకూరు పంచాయతీ పరిధిలో దాదాపు రూ.40 లక్షల ప్రభుత్వ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణాన్ని మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో మండల అధికారులు, ఆయా స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చౌడేశ్వరీదేవికి జ్యోతులు



చౌడేశ్వరీదేవిని ఊరేగిస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్: మండల పరిధిలోని గుట్టూరులో చౌడేశ్వరీదేవికి జ్యోతుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజామున నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అమ్మవారికి జోత్యులు మోసి మహిళలు మొక్కులు చెల్లించుకున్నారు.

నిత్యావసరాల పంపిణీ

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి మేజర్ పంచాయతీ పరిధిలో పని చేస్తున్న పారిశుద్య కార్మికులకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. మంగళవారం బీజేపీ మండలాధ్యక్షుడు బంగారు చంద్ర ఆధ్వర్యంలో దాదాపు 25 మంది కార్మికులకు బీజేపీ కార్యాలయంలో నిత్యావసరాలు అందించారు.